# పెమి 'నిజాలు'



"అబ్బా! ఈ పులుసేమిటి యింత కారంగా తగల బడింది". ముద్ద నోట్లో పెట్టుకుంటూనే మంచినీళ్ళ కోసం వెతుకుతున్నాడు శంకరం.

అవి టేబిల్ మీద కనపడలేదు.

"మంచి నీళ్ళు! మంచినీళ్ళు!"

అరిచినా పార్వతి కదల్లేదు.

ఓ క్షణం పార్వతి వంక కారంగా చూసి లేచి వెళ్ళి మంచి నీళ్ళు తాగి మరో రెండు గ్లాసులతో తెచ్చి టేబిల్ మీద పెట్టాడు.

కలిపిన పులుసన్నం అంతా అవతలకు తోసేస్తే ఆకలి తీరేలా లేదు. తింటే ఆకలి మంట తీరి మరో మంట మొదలయ్యేలా వుంది.

'అసలిదంతా నీ మూలానే – నాకు తిండి సుఖం కూడా లేకుండా పోయింది" కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు శంకరం.

"పులుసులో తక్కువ కారం పడుతుందని రోజూ ఉదయాన్నే లేవగానే చెప్పున్నా." నిర్లిప్తంగా ఆ కళ్ళ నీళ్ళు చూసింది పార్వతి.

"చెప్పున్నావు. అసలిదంతా నేను కాస్త మంచిగా నీ మాట వింటున్నందుకేగా– ఈ వంట బాధ నామీది కొచ్చి పడింది"

"ఎందుకైనా అనుకో. వంట నేనొక్క దాన్ని చెయ్యను. చెయ్యలేను. ఇద్దరం కలిసి హోటల్‌లో తిందామంటే చెప్పు" అంది పార్వతి.

"కర్మ! ఖర్మ" అంటూ కంచం తీసి సింకులో పడేసి బట్టలు వేసుకోడానికి వెళ్ళాడు.

రెండు నెలల నుంచీ ఇంట్లో సుఖమూ, శాంతీ, ఆనందం బొత్తిగా లేకపోవడం శంకరానికి స్పష్టంగా కనపడుతోంది. పార్వతి కెందుకు కనపడదా అని విస్తుపోతున్నాడు.

'ఈ పార్వతి ఒకటి పెట్టదు. ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం గాబట్టి యిద్దరం వంట కూడా చేయాల్సిందే అంటుంది. పెళయిన ఏడాది దాకా యిట్లాంటి వితండ వాదనలు చెయ్యలేదు. చక్కగా వంట చేసేది. టిఫిన్లు చేసేది. చిలకా గోరింకల్లా హాయిగా బతికే వారు. ఎక్కడ వేర్చుకుందో– ఎవరు ఈ పుల్ల పెట్టారో గానీ రెండు నెల్ల క్రితం వాదం వేసుక్కూచుంది.ఇంటి పని యిద్దరం సమానంగా చెయ్యాలి అని.

అప్పట్నించీ ప్రారంభమైనాయి తన కష్టాలు.

ఆ రోజు, ఈ పద్ధతికి సరే అని తలూపిన మొదటి రోజు తెలియలేదు ఈ పని యింత కష్టమని.

రోజూ రమ చులాగ్గా చేసేస్తుంది గదా– ఏదో తమ పక్కన నిలబడి తనూ రెండు కబుర్లు చెప్తూ ఓ చెయ్యి వేద్దాం అనుకున్నాడు.

అమ్మో– దిగింతర్వాత గానీ లోతు తెలియలేదు.

చేతులు కాలాయి. వేళ్ళు తెగాయి. రక్తం పారింది. కళ్ళంట ధారాపాతంగా కన్నీళ్ళు ఉరిశాయి. తన మీద అంత ప్రేమున్న పార్వతి దేవికీ చలించలేదు. మిలటరీ శిక్షణ యిచ్చే కమాండర్‌లా తన కష్టాలు చూసిన కొద్దీ రెచ్చిపోయిందే గాని పట్టు వదలలేదు.

వంటే అనుకుంటే–

పని మనిషి రాని రోజు అంట్లు తోమాలి. గుడ్డలుతా[illegible]. ఇల్లు చిమ్మాలి. పని మనిషి వచ్చినా సరే వారం వారం ఇల్లంతా దులిపి సర్దాలి. ఎనిమిది వారాలు, ఎనిమిది వారాలు ఇల్లు దులిపాడు. ఇక తన జీవితం యింతేనా–

ఆదివారం హాయిగా మంచం దిగకుండా కాపీ టిఫిన్లందుకునే రోజులు రావనుకుంటే–

రోజూ వంటయిందా అని కెకెయ్యటం కాకుండా వంట గదిలో మగ్గటమే తన జీవితం అనుకుంటే–

జీవితం మీద విరక్తి పుట్టుకొస్తోంది. తనకీ విరక్తి పెరుగుతుందే గాని తరగదు. ఏ సుఖమూ సంతోషమూ అనుభవించలేదు. నీరసంగా తయారవుతాడు. తనట్లా తయారయితే పార్వతికి మాత్రం సుఖమా ఇదంతా పార్వతి గ్రహించటం లేదు. రానున్న కాలంలో తమ జీవితానందం, అంతా ఎట్లా ధ్వంసం కానున్నదో పార్వతికి తెలిస్తే యిట్లాంటి ఆఓచనలు చెయ్యదు. తన చేతుల వంక చూసుకున్నాడు. వేళ్ళకు సన్నని గాట్లలు ముంజేతుల మీదా, మణికట్టు కివతలా కుక్కర్ అంటుకుంటే పడిన వాతలు.

ఇవి చూసి స్నేహితులంటున్న మాటలు మరింత చురుక్కు మనిపిస్తున్నాయి.

లాభం లేదు. ఇక యింతటితో ఈ ఆట ఆపాలి. శంకరం గట్టిగా నిర్ణయించుకున్నాడు.

ఆ రాత్రే పార్వతితో సంభాషణ మొదలు పెట్టాడు.

"మనం సరదాగా నవ్వుతూ మాట్లాడుకుని ఎన్నాళ్ళయింది?" శంకరం అడిగాడు.

"రెండు నెల్లు" పార్వతి టక్కున సమాధానం యిచ్చింది.

"మనం సాయంత్రాలు స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి ఎన్నాళ్ళయింది".

"రెండు నెల్లు"

"మనం సినిమాకు వెళ్లి ఎన్నాళ్ళయింది"

"రెండు నెలలు"

"మనిద్దరం కలిసి స్నేహితులకు ఉత్తరాలు రాసి ఎన్నాళ్లయింది."

"రెండు నెలలు".

"ఉదయాన్నే లేవగానే రాత్రి వచ్చిన కలల గురించి మాట్లాడుకుని ఎన్నాళ్ళయింది?"

"రెండు నెలలు"

"ఆదివారాలు ఆడుతూ పాడుతూ గడిపి ఎన్నాళ్ళయింది?"

"రెండు నెలలు".

"నిజంగా చెప్పు. మనం ఆనందంగా, చిలకా గోరింకల్లా కలిసి కాపురం చేసి ఎన్నాళ్ళయింది?"

"రెండు నెలలు"

"ఏమయింది? ఏమయింది ఈ రెండు నెలల నుంచీ" ఆవేదనతో ఆక్రోశంతో అడిగాడు శంకరం.

"నువ్వు కూడా ఇంటి పని చేస్తున్నావు" శాంతంగా చెప్పింది పార్వతి.

"మరిప్పుడేం చేద్దాం. ఇలాగే సుఖ సంతోషాన్ని సర్వ నాశనం చేసుకుందామా? ఇద్దరం వంటింటిలో మగ్గి చద్దామా? శంకరం గొంతులో కోపం ఆగటం లేదు.

"దీన్నించి నీకేం అర్థం కాలేదా?" మరింత శాంతంగా బుద్ధుడి నాయినమ్మలా అడుగుతున్న పార్వతిని చూస్తుంటే మండుకొచ్చింది శంకరానికి.

"ఏమిటి? ఏమర్థం కావాలి?" మూడో కన్ను తెరవబోయాడు.

"మనం సుఖంగా వుండే వాళ్ళం. మనం ఆనందంగా వుండే వాళ్ళం. అంటున్నావు. వంట పని చేస్తూ సుఖంగా వుండలేవని నీకు అర్థమయింది. ఇన్నాళ్ళ నుంచీ నేను వంట పని చేస్తుంటే సుఖంగా వున్నదీ, ఆనందంగా వున్నదీ నువ్వు మాత్రమేనని నీకెందుకు అర్థం కాదు? మనం సినిమాల కెళ్లిందీ, షికార్ల కెళ్ళిందీ చిలకా గోరింకల మయిందీ నా రెక్కల కష్టంతోనని అర్థమయిందా? పోనీ నువ్వొక్కడివే పనంతా చేసి చూడు మనం పూర్వంలా ఆనందంగా వుంటామేమో".

శంకరం నిరుత్తరుడయ్యాడు.

పార్వతి బుర్రలో పుట్టిన ఈ పురుగు సామాన్యమైంది కాదనీ. సంసార వృక్షాన్నే తొలిచేసేదనీ అనపించింది.

ఆ వెంటనే అతకింకో ఆలోచన కూడా వచ్చింది.

ఆడవాళ్ళు మాత్రమే ఇంటి చాకిరీ చేయటం మీదనే ఈ సంసార వృక్షం బతుకుతోందని–

పార్వతికి కూడా ఈ ఆలోచన వచ్చి వుంటుందా? వస్తే తనకు చస్తే విముక్తి లేదు అనుకున్నాడు.

* * *

ఇప్పుడు నిర్ణయించుకోవాల్సింది ఆడవాళ్ళే–

ఇంటి చాకిరీ పగలూ రాత్రీ చేసి ఈ సంసారాలను యిట్లా మగవాళకు మాత్రమే ఆనంద నిలయాలుగా వుంచాలా? తాము ఆనందంగా వుండటానికి కొన్ని ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలా?

**ఓల్గా**

5.7.96